# నాకు పాట నేర్పరూ- నన్ను ప్రోత్సహించరూ !

కోదండపాణి రికార్డింగ్ థియేటర్‌లోని ఓ ఎయిర్ కండిషన్డ్ రూమ్ ప్రశాంతంగా ఉంది. బాలు రివాల్వింగ్ చెయిర్‌లో వెనక్కువాలి, విశ్రాంతి తీర్చుకుంటున్నాడు. టేప్ రికార్డర్ నుంచి ఘంటసాల పాటలు మృదుమధురంగా వినిపిస్తున్నాయి. బాలు కళ్ళు మూసుకుని తన్మయత్వంతో వింటున్నాడు.



"జయకృష్ణా ముకుందా మురారీ" పాట వింటూ "అంత భక్తి పారవశ్యంతో పాడడం ఇతరులకు అసాధ్యం, ఘంటసాల మాస్టారికే అది సాధ్యం" అనుకున్నాడు బాలు. అంతలో కాలింగ్ బెల్ మోగినట్టనిపించి, అలవాటుగా "కమిన్" అని కళ్ళు తెరిచాడు బాలు. తలుపు తెరుచు కోలేదు. కానీ, టేబుల్ దగ్గర ఒక వ్యక్తి నిలుచున్నాడు. తెల్లపంచె, తెల్ల చొక్కా, ముఖానికి కళ్ళజోడు, చెరగని చిర్నవ్వు. బాలు ఆశ్చర్యంగా చూశాడు. అయోమయంగా చూశాడు. నమ్మలేనట్టుగా చూశాడు.

మీరా మాస్టారు"

"నేనే బాబూ"

"మీరు మీరేనా మాస్టారూ" బాలు మళ్ళీ అడిగాడు అనుమానంగా.

"నేనే బాబూ, ఘంటసాలను"

"నేనెంత అదృష్టవంతుణ్ని మాస్టారూ, ఇలా కూర్చోండి సార్"

"సంతోషం నాయనా" అంటూ ఘంటసాల కుర్చీలో కూర్చునాడు.

"కాఫీనా, టీనా మాస్టారూ"

"అవొద్దూ బాబూ, కాసింత మిరియాల పొడి కలిపిన పాలు చాలు బాబూ. గాత్రానికి కూడా మంచిది."

"అలాగే సార్" అని బాలు కాలింగ్ బెల్ నొక్కి బోయ్‌కు చెప్పాడు."

మళ్ళీ ఎన్నాళ్ళకు చూశాను మాస్టారూ, మీరొచ్చేటప్పటికి మీ పాటనే వింటున్నాను మాస్టారూ"

చాలా సంతోషం బాబూ. నువ్వు కాస్త నన్ను ప్రోత్సహించాలి నాయనా'

"నన్ను అవమానిస్తున్నారు మాస్టారూ"

"కాదు బాబూ, నాకు నువ్వు పాటలు నేర్పాలి బాబూ"

"మీరు నా దగ్గర ఇలాంటి జోకులెయ్యడం న్యాయం కాదు సార్"

"మొన్నటి దాకా నన్ను ప్రోత్సహించింది పాటలు నేర్పింది ఎవరో నీకూ, ఈ ప్రపంచానికీ తెలీదు బాబూ"

"మీరేమంటున్నారో నాకు అర్థం కావడం లేదు మాస్టారూ"

"ఇందులో అర్థం కాకపోవడానికేముంది బాబూ"

"నిజంసార్"

"నాకేం తెలియడంలేదు. డైరెక్టుగా మీరు చెప్పండి సార్"

కె.వి.యస్.వర్మ ఫీచర్స్

కథా నిలయం
శ్రీకాకుళం

"సరే బాబూ నన్నింతకాలం ప్రోత్సహించి పాటలు నేర్పి మాటలు మాత్రం నేర్పని మహానుభావుడి గురించి ఇంతకాలం నేనేవరికీ చెప్పలేదు బాబూ, ఆయన చెప్పేవరకూ నిజానికి నాకూ తెలీదు బాబు"

"విచిత్రంగా మాట్లాడుతున్నారే. ఇంతకీ ఆ మహానుభావుడు ఎవరు సార్"

"ఎవరో ఏమిటీ బాబూ, మన విశ్వవిఖ్యాత నట సర్వభౌములుంవారు"

"ఆయనా! మిమ్మల్ని ప్రోత్సహించడం ఏమిటి సార్"

"అలాఅనకు బాబూ"

"లేచింది నిద్రలేచింది మహిళా లోకం పాట ఎవరిదనుకుంటున్నావ్"

"మీదే సార్"

"కాదు బాబూ, విశ్వవిఖ్యాత నటసార్వభౌములుంవారే నాకు నేర్పి ప్రోత్సహించారు"

"అబద్ధం సార్. ఆ పాట మీదే, సంగీత దర్శకుడు కూడా మీరే" అన్నాడు బాలు ఆవేశంగా.

చిన్నగా నవ్వి "బాబూ, ఎందుకంత ఆవేశం? మత్తువదలరా నిద్దుర మత్తు వదలరా' పాట ఎవరిది బాబూ"

"మీరే పాడారు మాస్టారూ. సంగీత దర్శకుడేమో టి.వి. రాజు సార్"

"కాదు బాబూ కాదు. విశ్వవిఖ్యాత నటసార్వభౌములుంవారే ట్యూన్‌కట్టి, నా వెన్ను తట్టి ప్రోత్సహించారు నాయనా"

"ట్యూన్ కట్టింది టి.వి. రాజు అని అందరిలానే నేనూ అనుకుంటున్నానే" అన్నాడు బాలు నసుగుతూ.

"అలా అనుకుంటున్న విషయం నిజమే బాబూ"

బాలుకేం మాట్లాడలో తెలీక మౌనంగా చూస్తుండిపోయాడు నిలువుగుడ్లేసుకుని.

"శివశంకరీ" పాటకు ట్యూన్ కట్టి నన్ను ప్రోత్సహించింది ఎవరో తెలుసా బాబూ"

"ఎందుకు తెలీదు, పెండ్యాల సార్"

"కాదు బాబూ విశ్వవిఖ్యాత నటసార్వభౌములుంవారే"

"అలాగా సార్" అన్నాడు బాలు అయోమయంగా.

"అవునట బాబూ" అన్నాడు ఘంటసాల పాలిపోయిన ముఖంతో.

బాలు తలపట్టుకుని "శంకరా నాద శరీరా" అనుకుంటూ గింజుకున్నాడు.

"బాబూ, ఇప్పుడయినా నాకు పాటనేర్పి నన్ను ప్రోత్సహించవూ"

"మాస్టారూ, ఆయనంతటివాడేమో కానీ, నేనంతటి వాణ్ణి కాదు సార్"

"నన్ను ప్రోత్సహించవా అయితే"

"అలాగయితే ఆయన దగ్గరకే వెళ్ళలేకపోయారా సార్" అన్నాడు బాలు పిచ్చెక్కినట్టయి.

"వెళ్లేను బాబూ వెళ్ళేను. నా భుజం తట్టి, గంభీరంగా నవ్వి భీకరంగా డైలాగులు చెప్పి 'కిలో బియ్యం రెండ్రూపాయలు, హలో బ్రదర్ ఇవే మా వరాలు' అంటూ పాడమని, 'పాట మధ్యలో రెండు డైలాగులుంటాయి. వాటిని మేమే చెబుతాం. గతంలోలాగే' అంటూ షరతుపెట్టాడు. జనం ఏమంటారేమో నని భయపడి నీ దగ్గరకు వచ్చేశాను. రాజకీయాలు నాకు పడవని నీకు తెలుసు కదా బాబూ"

"తెలుసు మాస్టారూ, నా కిప్పుడంతా అర్థమయ్యింది సార్. మొన్న మీ కాంస్య విగ్రహం ఆవిష్కరణ సభలో జరిగిన దానికి నా కంటే మీరే ఎక్కువగా బాధపడినట్టున్నారు మాస్టారూ"

"అందుకే నీ దగ్గరకొచ్చేను బాబూ"

"ఎంత మాటన్నారు మాస్టారూ, మీ పాట వినడమే మా అదృష్టం. మీలో వందోవంతు పాడగలిగితే అది నాఅదృష్టం" అంటూ బాలు ఘంటసాల చేతుల్ని చెమ్మగిల్లిన తన కళ్ళకద్దుకున్నాడు.

అంతట తాపమునశియించి, ఘంటసాల జన్మ ధన్యత గాంచెన్... తృప్తిగా అంతర్ధానమయ్యెన్.

2.3.93, ఉదయం దినపత్రిక